క్లుప్తంగా

సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా దీప్తి



గంపలగూడెం: మండల సర్పంచుల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. తిరువూరులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అనుముల్లంక సర్పంచ్ అత్తునూరి దీప్తి అధ్యక్షురాలిగా, ఉపాధ్యక్షుడిగా దుందిరాలపాడు సర్పంచ్ బంక బాబురావు, కన్వీనర్‌గా అమ్మిరెడ్డిగూడెం సర్పంచ్ బజ్జూరి చంద్రశేఖర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభ్యులు కె.రక్షణనిధి శాలువాలు కప్పి అభినందించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీట్ పీజీలో శైలజకు 300వ ర్యాంక్



తిరువూరు: ఇటీవల విడుదలైన నీట్ పీజీ సెట్ ఫలితాల్లో మండలంలోని జికొత్తూరుకు చెందిన యరమల శైలజారెడ్డి జాతీయ స్థాయిలో 300వ ర్యాంకు సాధించారు. తిరువూరు శ్రీనిధి స్కూల్లో 10వ తరగతి, విజయవాడ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన ఆమె ఎంబీబీఎస్ విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో అభ్యసించారు. శైలజారెడ్డి తల్లి జీకొత్తూరు ఎంపీటీసీ సభ్యురాలు కాగా, తండ్రి సైదులు రెడ్డి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు. నీట్ పీజీలో ర్యాంకు సాధించిన విద్యార్థినిని పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పుష్కరఘాట్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా దిగువ పేర్కొన్న ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ముస్తాబాద్ పంపింగ్ స్కీమ్ ఏరియా, నూజివీడు పంపింగ్ స్కీమ్ ఏరియా, రజక వీధి, లైబ్రరీ వీధి, వన్ సెంటర్, హర్షిత మెగా టవర్స్, కరకట్ట, పంచాయితీ వాటర్ స్కీమ్ ఏరియా వరకు కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెరటికోళ్లు పెరుగుదలపై ఆరా

ఇబ్రహీంపట్నం: ఇటీవల డ్వాక్రా సంఘాల మహిళలకు పంపిణీ చేసిన పెరటి కోళ్లను ఆ సంస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీఎం శోభన్‌బాబు బుధవారం పరిశీలించారు. కేతనకొండ, మూలపాడు గ్రామాల్లోని లబ్ధిదారుల వద్ద కోళ్ల పెరుగుదలపై ఆరా తీశారు. మూడు నెలల క్రితం ఒక్కొక్క కోడి కిలో బరువు ఉండగా ప్రస్తుత 2 నుంచి 3 కిలోల బరువు పెరిగినట్లు గుర్తించారు. కోడి గుడ్లు సైజును బట్టి ఒక్కొక్కటి రూ.12 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. నాటుకోడి మాదిరిగా ఈకోళ్లకు కూడా మంచి గిరాకీ ఉన్నట్లు లబ్ధిదారులు తెలిపారు. సీసీ రామాంజమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు హర్షణీయం

మైలవరం: 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని పీఆర్టీయూ మైలవరం శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.గోపాల్, ఎం.వెంకటేష్ తెలిపారు. సంఘ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు కాపలాదారులను నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లారెడ్డి, సతీష్, శేషగిరిరావు, నాగలత, శాంత పాల్గొన్నారు.

రైతుల జాబితాలు ప్రదర్శన



తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో రబీ సీజన్లో ఈక్రాప్‌లో నమోదైన రైతుల జాబితాలను బుధవారం ప్రదర్శించారు. ఏవో పద్మ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఆయా గ్రామాల్లో నమోదైన రైతులు సాగుచేస్తున్న పంటలు, వాటి విస్తీర్ణం వివరాలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఈ జాబితాల్లో ఏవైనా తప్పులు దొర్లితే వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసి సరిచేయించుకోవాలని సూచించారు.

హిందీ పరీక్షల్లో కౌసర్ ప్రతిభ



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన వార్షిక పరీక్షల్లో పట్టణానికి చెందిన షేక్ సనా అంజుమ్ కౌసర్ అత్యధిక మార్కులు సాధించినట్లు హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ తెలిపారు. ప్రవేశిక పరీక్షల్లో 300 మార్కులకు 189 సాధించి తిరువూరు, గంపలగూడెం మండలాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభం కావడంతో తొలి రోజున విద్యార్థులందరూ అర గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ ఏడాది నిబంధనలు కఠినతరం చేయడంతో ఉదయం 8.30 గంటల నుంచి 8.45 గంటల మధ్య పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ సబ్జెక్టులకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో కలిపి 1,587 మంది విద్యార్థులకు గానూ 1,519 మంది హాజరయ్యారు. 68 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 354 మందికి 23మంది గైర్హాజరవ్వగా 331 మంది, సెయింట్ ఆన్స్ కళాశాలలో 348 మందికి 14మంది గైర్హాజరవ్వగా 334 మంది, శ్రీ శారద కళాశాలలో 526 మందికి 16 మంది గైర్హాజరవ్వగా 510 మంది, శ్రీ వాగ్దేవి కళాశాలలో 359 మందికి 15మంది గైర్హాజరవ్వగా 344 మంది పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను తహసీల్దారు డీవీఎస్ యల్లారావు విధించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా ఐ.గిరిదేవి, ఈదర కోటేశ్వరరావు, ఎస్.వెంకటలక్ష్మి, కె.సంధ్యాజ్యోతి వ్యవహరించారు.

తిరువూరు: పట్టణంలో బుధవారం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు పరీక్షా కేంద్రాల్లో 57 మంది విద్యార్థులు తొలిరోజు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 324 మంది విద్యార్థులకు 287 మంది, నాగార్జున కళాశాలలో 210 మంది విద్యార్థులకు గాను 201 మంది, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పరీక్షా కేంద్రంలో 372 మందికి 361 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. తెలుగు, సంస్కృతం, హిందీ సబ్జెక్టులలో మొదటిరోజు పరీక్ష నిర్వహించారు.



మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బుధవారం తెలిపారు. వికాస్ జూనియర్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, కృష్ణారావుపాలెం గురుకుల కళాశాల, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న 135 మంది విద్యార్థులకు గాను 130 మంది పరీక్షలకు హాజరయ్యారని, ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ నెల 28వ తేదీన వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

మైలవరం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 238 మందికి గాను 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. బయటి వారిని ఎవరినీ లోనికి అనుమతించకుండా పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారు.

తోటమూల(గంపలగూడెం): ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ సబ్జెక్టు జనరల్ ఫౌండేషన్ కోర్స్ (జీఎఫ్‌సీ)లకు 278 మంది హాజరుకావాల్సి ఉండగా 22 మంది గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కిలారు హనుమంత ప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి యోగానందరావు తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ ప్రథమ ఏడాది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మూడు కళాశాలల్లో 1078 మందికిగాను 1062 మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు. జాకీర్‌హుసేన్ కళాశాలలో 365 మందికి 358 మంది రాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. జూనెట్ కళాశాలలో 359 మందికి 354 మంది రాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. నాగార్జున కళాశాలలో 354 మందికి గానూ 350 మంది హాజరయ్యారు. నలుగురు హాజరు కాలేదని అధికారులు తెలిపారు.



తిరువూరులో రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఆగిరిపల్లి: స్థానిక గన్నవరం రోడ్డులోని ఎంవీఎస్, వైవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని ఇంటర్ బోర్డు ప్రకటించడంతో విద్యార్థులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 86 మందికి 83 మంది హాజరయ్యారు. గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభయవుతాయని ఈ పరీక్షలకు 83 మంది విద్యార్థులు హాల్ టికెట్లు పొందినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ అరుణశ్రీ తెలిపారు.

విస్సన్నపేట: మండల కేంద్రంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నిర్వహించారు. 1546 మంది విద్యార్థులకు గాను 1501 మంది పరీక్షలకు హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీకేఎన్‌పీ కళాశాల, వికాస్, శ్రీశ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ

మైలవరం: నులి పురుగులు నివారించి ఆరోగ్యం కాపాడుకోవాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. నులిపురుగు నివారణ దినోత్సవంలో భాగంగా మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కృష్ణా యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షల్లో పాల్గొన్న ఎస్వీఆర్‌జీ కళాశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు బిళ్లలు బుధవారం పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వి. ఫణికుమార్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ మేజర్ మన్నే స్వామి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు



తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): రైతుభరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచిన పంట నమోదు వివరాలు రైతులు సరిచూసుకోవాలని ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని తెల్లదేవరపల్లి రైతుభరోసా కేంద్రాన్ని ఏవో బుధవారం పరిశీలించారు. రబీ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు పంటల నమోదు మార్పు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: వలసపల్లిలో బుధవారం పేకాట శిబిరంపై దాడిచేసి ఎనిమిది మందిని అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,250 నగదు, మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను గురువారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు.

వరి పైరు పరిశీలన

మైలవరం: వరిలో కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఆశిస్తుందని, దీని ప్రభావంతో తెల్లకంకులు వస్తాయని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి. వెంకటసుబ్బయ్య తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంలోని రైతు గోగులమూడి సత్యనారాయణరెడ్డి వరి చేలను బుధవారం గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 60 మిల్లీ లీటర్ల కోరాజన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగులను రైతులు ముందుగానే గమనించి నివారణ చర్యలు తీసుకుంటే అంతగా ప్రభావం ఉండదన్నారు. బృందంలో శాస్త్రవేత్తలు పీఎస్ శివప్రసాద్, ఇ. వెంకటరెడ్డి, లక్ష్మీకళ, రాజశేఖర్, రాజనరసింహారావు, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మద్దులపర్వలో పొలంబడి

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రెంటపల్లి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి జరిగింది. మిత్ర పురుగులు వాటి వల్ల లాభాలు గురించి ఏవో వివరించారు. అక్కడక్కడ దోమ కనబడుతుందని అవి ప్రస్తుత దశలో తక్కువగా ఉన్నందున వేపనూనె 1500 పీపీఎం లీటర్/ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరిలో బెట్ట పరిస్థితులు ఉన్నట్లయితే మల్టీ-కే(13-0-45) కేజీ/ ఎకరాకు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, అధికారులు వరిపొలం పరిసరాలను పరిశీలించారు. రమణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఝాన్సీ, పవన్ పాల్గొన్నారు.

పంట పొలాలు పరిశీలన

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో బుధవారం గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రము శాస్త్రవేత్తలు వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గరికపాడు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు స్పైనోసిడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరామ్‌ట్రి నిల్లి ప్రోలో 0.3 మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు పీఎస్ శివ ప్రసాద్, ఐ వెంకటరెడ్డి, ఎస్ రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీకళ, ఎం.రాజనర్సిహం, ఏవో టిప్పు సుల్తాన్, ఏఈవో రామచంద్రారావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

సుడి దోమ నివారణకు సూచనలు

కాకర్ల(తిరువూరు): మండలంలోని కాకర్లలో సుడిదోమ తెగులు సోకిన వరిపైరును గరికపాడు వ్యవసాయ పరిశోధనా కేంద్ర సమన్వయకర్త వెంకటసుబ్బయ్య, వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. వాతావరణంలో మార్పుల కారణంగా సుడిదోమ సోకుతుందని, దీని నివారణకు రైతులు తగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సుడిదోమ అదుపు చేయకపోతే దిగుబడిపై గణనీయ ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంకటరెడ్డి, రాజశేఖర్, శివప్రసాద్, లక్ష్మీకళ, రాజనరసింహ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు పోలీసుల ఆపన్న హస్తం

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెంలో మంగళవారం పూరిల్లు దగ్ధమైన ఘటనలో నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి పోలీసులు ఆపన్న హస్తం అందించారు. గ్రామానికి చెందిన శిలారపు దాసు పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబ సభ్యులందరూ కట్టుబట్టలతో మిగిలారు. స్పందించిన ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, మహిళా పోలీసుల సహకారంతో బాధితులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులు, కొంత నగదును అందజేసి ఆదుకున్నారు. పోలీసుల ఉదారతకు నిరాశ్రయులైన బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



నిత్యావసర సరుకులు అందించిన ఆగిరిపల్లి ఎస్‌ఐ చంటిబాబు, మహిళా పోలీసులు

విద్యుత్ రాగి తీగల చోరీలపై కేసు నమోదు

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల పొలాల్లోని ట్రాన్స్ ఫార్మర్లలో ఉన్న కాపర్ (రాగి) తీగల చోరీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని గోపవరానికి చెందిన ఎ.ఉషారాణి, ముసునూరుకు చెందిన కె.గజలక్ష్మి, రేగుల గోపాలకృష్ణ, కె.రమేష్ బాబుకు చెందిన పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధిత రైతులు విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేశ్వరరావు తనిఖీలు చేసి, బాధిత రైతులను విచారించారు. అనంతరం ఏఈ హేమ సుందరకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): రైతులు ప్రతి వ్యవసాయ సీజన్‌లో ఈ క్రాఫ్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ జిల్లా అధికారి ఎం.విజయభారతి అన్నారు. మూలపాడు రైతు భరోసా కేంద్రంలో రబీ సాగు ఈ క్రాప్ నమోదు సామాజిక తనిఖీ, గ్రామ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నమోదు చేసుకున్న రైతులు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తప్పనిసరగా సరిచూసుకోవాలని సూచించారు. పంటల బీమా, పంటల కొనుగోలు, నష్ట పరిహారం సున్నా వడ్డీ వంటి పథకాలు వస్తాయన్నారు. ఏవో శైజల, రైతులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పద్మశ్రీ

మైలవరం: బార్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బార్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షురాలిగా పావులూరి పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శిగా బుద్దవరపు వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా ఓర్సు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ రాజేష్, కోశాధికారిగా పత్తిపాటి రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైలవరం బార్ అసోసియేషన్‌కు మహిళా న్యాయవాది పావులూరి పద్మశ్రీ అధ్యక్షురాలు కావడం అభినందనీయమని తోటి న్యాయవాదులు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్నటువంటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముల్లంగి రవికుమార్ ప్రధాన కార్యదర్శి ఎం. శరత్‌బాబును న్యాయవాదులు అభినందించి, వీడ్కోలు పలికారు. కమిటీకి శరత్‌బాబు కన్వీనర్‌గా ఎన్నికయ్యారు.



మైలవరం బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు పద్మశ్రీ, వెంకట్రావు, శ్రీనివాసరావు

డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రాజీవ్‌నగర్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ బుధవారం శ్రీకారం చుట్టారు. ఆయా ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కార్యదర్శిని కోరగా తక్షణమే స్పందించిన ఆయన రైల్వే వ్యాగన్‌వర్క్‌షాపు ప్రధాన రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణంకు అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. రైల్వే రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మిస్తే రెండు ప్రాంతాల ప్రజల మురుగు నీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత తనిఖీ

ముసునూరు: ముసునూరు బాలికల గురుకులంలో అధికారులు, ప్రజాప్రతినిధులు భోజన నాణ్యత, వసతి సౌకర్యాలపై తనిఖీలు చేపట్టారు. మండల విద్యాశాఖాధికారి పి. రత్నకుమార్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీడీవో జి.రాణి, సీఆర్పీలతో కలిసి బుధవారం మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. భోజనం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్యా ప్రగతి తదితర అంశాలపై ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి పాఠశాల విద్యా ప్రగతిని వివరించి, అవసరమైన వసతులను వివరించారు. సిబ్బంది కొరత ఉందని, గెస్ట్ టీచర్లతో విద్యా బోధన నిర్వహిస్తున్నామని చెప్పారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను రుచిగా, శుచిగా వండి విద్యార్థులకు వడ్డించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

ముసునూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమగ్ర సేవలు అందించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని గుళ్ళపూడి, వలసపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును, రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ ఆర్ శ్రీదేవి, సీహెచ్ దామోదర్, ఎంపీటీసిలు సత్యవాణి మూర్తి, రాటాలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం: బ్యాంకు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్స్‌తో పాటుగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతకు విద్యాదర్శిని పేరుతో ఉచిత శిక్షణను అందజేస్తున్నామని విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పోలీసు కమిషనర్ టీకే రాణా బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విద్యాదర్శిని వెబ్‌సైట్‌ను ప్రారంభించారని విజయ్‌కుమార్ తెలిపారు.

సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి

సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి

విజయవాడ కల్చరల్: తెలుగు సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి అని మహానటి సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం, సినీనటి సావిత్రి స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి, అంతర్జాతీయ గాయని సుధా శ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయచాముండేశ్వరి మాట్లాడుతూ మహానటి పేరుతో 16 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం సేవలను అభినందించారు. సినీ దిగ్గజం దాసరి నారాయణరావు సావిత్రి పేరుతో కళాపీఠం స్థాపించాలని భావించారని, వారి కోరికను పరచూరి విజయలక్ష్మి సాకారం చేశారన్నారు. సావిత్రి కుమార్తెగా ఆమె అభిమానులు తనను కూడా అభిమానిస్తున్నారని, పూర్వజన్మ సుకృతంగా భావించ వచ్చన్నారు. శాతవాహనా కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడారు.

భూహక్కు పత్రాలు పంపిణీ



గంపలగూడెం: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షలో భాగంగా భూ రీ సర్వే పూర్తయిన కనుమూరు, వినగడప గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ చేపట్టారు. ఆయా గ్రామ సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. వినగడపలో ఇప్పటి వరకు మూడు విడతలుగా 1045, కనుమూరులో రెండు విడతలుగా 1168 శాశ్వత భూహక్కు పత్రాలను ఉన్నతాధికారులు సరఫరా చేశారు. సంబంధిత భూహక్కు పత్రాలను రైతాంగానికి పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు. ఆర్ఐ మోహన్, వీఆర్వోలు ప్రభాకర్‌రెడ్డి, దుర్గారావు, సర్వేయర్లు రాంబాబు, నాగ నరసింహారావులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు మేలు



జి.కొండూరు: వైఎస్సార్ జలకళ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బోరుబావులు ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు గ్రామానికి చెందిన రైతు తియ్యగూర ప్రతాప్‌రెడ్డి వ్యవసాయభూమిలో వైఎస్సార్ జలకళ పథకం కింద వేయనున్న బోరుకు ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ బుధవారం సాయంత్రం భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.